

జాలీగా.. హోలీ

హోలీ సంబరాలతో జిల్లా హుషారెత్తింది. చిన్నా, పెద్దా అంతా కలిసి సోమవారం రంగులు చల్లుకుంటూ రోజంతా ఆనందడోలికల్లో మునిగితేలారు. యువతులు సైతం రంగు నీళ్లతో తడిసి ముద్దయ్యారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కృష్ణా వర్సిటీలో వర్గపోరు

విద్యార్థులను సన్మార్గంలో నడపాల్సిన కృష్ణా యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గుతున్నారు. తమకు అనుకూలంగా లేని, నిబంధనల ప్రకారం యూనివర్సిటీని నడపాలని చెప్పే అధ్యాపకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. యూనివర్సిటీలోని అధ్యాపకులు రెండువర్గాలుగా విడిపోయి ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. తెరవెనుక రకరకాల కారణాలు చూపుతూ తమకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న అధ్యాపకులను అదనపు బాధ్యతల నుంచి అకారణంగా తొలగించేస్తున్నారు. దీంతో ఇబ్బందుల పాలైన అధ్యాపకులు తమకు జరిగిన అన్యాయంపై కోర్టులోనే తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.



కృష్ణాయూనివర్సిటీ

అనుకూలంగా లేని అధ్యాపకులపై అధికారుల కక్షసాధింపు

- ఎంబీఏ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ తొలగింపు
- నూజివీడు ప్రిన్సిపాల్ కూడా..
- కోర్టును ఆశ్రయించనున్న ప్రొఫెసర్లు
- రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే చర్యలు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీలో ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా డాక్టర్ జయశంకరప్రసాద్ పనిచేస్తున్నారు. 2022 జూలై 1వ తేదీన హెచ్‌వోడీగా ఆయనకు రెండేళ్లపాటు కొనసాగేలా బాధ్యతలు అప్పగించారు. 2024 జూన్ 30వ తేదీ వరకు ఆ పదవిలో ఆయన కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన జయశంకర ప్రసాద్‌ను హెచ్‌వోడీ బాధ్యతల నుంచి తొలగించి, యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుందరకృష్ణకు ఈ బాధ్యతలు అప్పగించినట్టు ప్రకటించారు. ప్రిన్సిపాల్ ఈ బాధ్యతలను చేపట్టకుండా వేరే అధ్యాపకురాలికి అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్టు చెప్పడం గమనార్హం. తాను ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా పనిచేసేందుకు ఇంకా మూడు నెలలపాటు పనిచేసేందుకు సమయం ఉందని, ఏ కారణం చేత తనను తొలగించారో తెలియజేయాలని కోరినా యూనివర్సిటీ అధికారులు ఆయనకు స్పష్టత ఇవ్వలేదు. తనకు ముందస్తుగా నోటీసు ఇవ్వలేదని, తన నుంచి సంజాయిషీ కోరలేదని, కనీసంగా తనచేతికి ఉత్తర్వుల కాపీని కూడా ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని జయశంకరప్రసాద్ యూనివర్సిటీ అధికారులను కోరితే ఎలాంటి సమాధానం చెప్పలేదు. తనను ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా తొలగిస్తూ అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చాకే తదుపరి నిర్ణయం తీసుకుంటానని, ఈ అంశంపై అవసరమైతే హైకోర్టు ఆశ్రయిస్తానని ఆయన చెబుతున్నారు.

నూజివీడు పీజీసెంటర్ ప్రిన్సిపాల్ విషయంలోనూ అదేతీరు

కృష్ణా యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా ఈనెల 5వ తేదీన శోభన్‌బాబు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని నూజివీడు పీజీ సెంటరు ప్రిన్సిపాల్ ఎంవీ బసవేశ్వరరావును ఎలాంటి కారణం లేకుండానే మార్చివేశారు. బసవేశ్వరరావు 2010 నుంచి 2021 వరకు నూజివీడు పీజీ సెంటరు ప్రత్యేక అధికారిగా పనిచేశారు. అనంతరం నూజివీడు పీజీ సెంటరుకు ఇద్దరు ముగ్గురు ప్రిన్సిపాల్స్ మారిన తరువాత 2023 జూలై నెల నుంచి ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నూజివీడు పీజీ సెంటరును నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి సందర్శించారు. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ప్రిన్సిపాల్ పదవి నుంచి బసవేశ్వరరావును తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. నూజివీడు పీజీ సెంటరులో జువాలజీ విభాగంలో పనిచేస్తున్న లావణ్యలతకు ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించారు. ఆమె కృష్ణా యూనివర్సిటీలో పాఠాలు బోధించేందుకు మచిలీపట్నం వచ్చిన రోజుల్లో కృష్ణా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఒక అధ్యాపకుడిని నూజివీడు పీజీ సెంటరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు. నూజివీడు పీజీ సెంటరులో అధ్యాపకులు ఉన్నా, వారెవరికీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించకుండా, మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో అధ్యాపకుడిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించి నూజివీడుకు పంపుతున్నారు. ఆయన నూజివీడు వెళ్లివచ్చిన ప్రతిసారి యూనివర్సిటీ నుంచి టీఏ, డీఏలు చెల్లించడం గమనార్హం. నూజివీడు పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ పోస్టు నుంచి తనను తొలగించిన నేపథ్యంలో మాతృసంస్థ అయిన యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌కు తనను బదిలీచేయాలని బసవేశ్వరరావు పెట్టుకున్న దరఖాస్తును పెండింగ్‌లోనే పెట్టడం గమనించ దగ్గ అంశం.

అక్రమాలను ఎత్తిచూపే ప్రయత్నం

యూనివర్సిటీలో ఉన్నతాధికారులు కొంతమంది మాటలు విని, ఒకవర్గం వారిని అకారణంగా ఇబ్బందులపాలు చేయడం, వారికి గతంలో ఇచ్చిన అదనపు బాధ్యతల నుంచి తొలగించడం తదితర కారణాల నేపథ్యంలో యూనివర్సిటీలో అడ్డగోలుగా తీసుకునే నిర్ణయాలపై సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు కోరే ప్రయత్నం అధ్యాపకులు చేస్తున్నారు. తప్పుడు సమాచారం ఇస్తే వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారికి యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నాలుగైదు విభాగాల్లో అదనపు బాధ్యతలు అప్పగించడం, పీహెచ్‌డీలు మంజూరుచేసే అంశంలో తీవ్రజాప్యం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం, యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్మాణం చేసే భవనాలకు నిధులున్నా విడుదల చేయకుండా జాప్యం చేయడం, విద్యార్థులు చెల్లించిన ఫీజులను దుర్వినియోగం చేయడం తదితర అంశాల్లో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి వివరాలు సేకరించి, నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఈ అంశాలపై న్యాయరంగా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. యూనివర్సిటీలో అధ్యాపకుల మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

మట్టి తవ్వారు కానీ.. వాహనాల్లేవ్!

- పై అధికారులకు ఇదే రిపోర్టు చేస్తా
- ముడా భూముల్లో అక్రమాలను పరిశీలించిన ఆర్ఐ




మేకావానిపాలెంలో గుట్టలుగా పోసి ఉన్న మట్టి

మండలంలోని మేకావానిపాలేనికి చెందిన 145, 146 సర్వే నెంబర్లలోని 8 ఎకరాల ముడా (మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. 'ముడా భూముల్లో మట్టి అక్రమాలు' పేరుతో ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనంతో అక్రమార్కులు అలర్ట్ అయ్యారు. మట్టిని మేకవానిపాలెం సెల్‌ఫోన్ టవర్ వెనుక, మిడ్‌లాండ్ ఎదురుగా గుట్టలు పోసి వాహనాలతో సహా మంగళవారం ఉడాయించారు. ఆ తరువాత విచారణకు వచ్చిన ఆర్ఐ యాకూబ్ మట్టి తవ్వకాలను పరిశీలించారు. ఇక్కడ మట్టి తవ్వకాలు జరిగినట్టు ఆనవాళ్లు ఉన్నాయి కానీ, వాహనాలు ఏమీ లేవని, ఉన్నతాధికారులకు ఇదే నివేదిక ఇస్తానని చెప్పడం గమనార్హం. - మచిలీపట్నం టౌన్

పశ్చిమాన పొత్తు పొడుపు

విజయవాడ పశ్చిమకు బీజేపీనే..

- సుజనా చౌదరి పేరు దాదాపు ఖరారు
- ఇంకా పోరాడుతున్న పోతిన మహేశ్
- మూడు పార్టీలు కలిస్తే విజయం సునాయాసమే..



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ.. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దృష్టి కేంద్రీకృతమైన నియోజకవర్గం. బీజేపీ అభ్యర్థిగా సుజనా చౌదరి బరిలోకి దిగుతున్నారన్న ప్రచారంతో ఎన్నికల వేడి మరింతగా రాజుకుంది. మైనారిటీల సీటుగా పేర్కొనే విజయవాడ పశ్చిమ నుంచి బీజేపీ పోటీ చేయడం, అది కూడా ఆ పార్టీలో ప్రముఖ నేతగా ఉన్న సుజనా చౌదరి పోటీలో ఉంటారన్న ప్రచారంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది.

మైనారిటీల ప్రాబల్యమెక్కువ

ఈ నియోజకవర్గం 1967లో ఆవిర్భవించింది. నాటి నుంచి 12 సార్లు ఎన్నికలు జరిగితే ఐదుసార్లు మైనారిటీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో ఐదుసార్లు సమీప ప్రత్యర్థులుగా నిలిచారు. అలాంటి సీటు నుంచి బీజేపీ పోటీ చేయడం ఆసక్తిని పెంచే అంశమే. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2.51 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 40 వేల వరకు మైనారిటీ ఓటర్లు. ఎస్సీలు, బీసీలు సింహభాగం ఉన్నారు. వీరి ఓట్లు సుమారు 1.20 లక్షల వరకు ఉంటాయి. బీసీల్లో కూడా నగరాల సంఖ్య ఎక్కువ. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఒకే ఒక్కసారి మాత్రమే ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందింది. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బీఎస్ జయరాజ్ 1983లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 2009 నుంచి ఎన్నికలను పరిశీలిస్తే.. 2014లో మాత్రమే బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాస్ పోటీ చేశారు. ఆయనకు 60,072 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి జలీల్‌ఖాన్ 3,100 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మిగిలిన ఏ ఎన్నికల్లోనూ బీజేపీకి 5 వేలకు మించి ఓట్లు రాలేదు.

వ్యూహంతోనే విజయావకాశాలు

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థిగా సుజనా చౌదరి ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. ఈ మూడు పార్టీలు కలిస్తే ఇక్కడ బీజేపీ గెలుపు అసాధ్యమేమీ కాదు. కానీ, జనసేన నుంచి టికెట్ ఆశించి భంగపడిన పోతిన మహేశ్ ఏ మేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికీ మహేశ్ తనకు సీటు కేటాయించాలంటూ పోరాడుతున్నారు. ఈ అవరోధాన్ని అధిగమించగలిగితే కూటమి అభ్యర్థికి సగం విజయం దక్కినట్టే. ఆ తర్వాత టీడీపీలో జలీల్‌ఖాన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా కీలక నేతలుగా ఉన్నారు. వీరంతా ప్రస్తుతం టీడీపీలో ఉన్నా.. ఎవరికివారే అనే రీతిలో ఉన్నారు. వీరిని సమన్వయం చేసుకుని ఎన్నికల బరిలోకి వెళ్తే కూటమి అభ్యర్థి గెలుపు పెద్ద కష్టమేమీ కాదు.

ఆదివారం అనూహ్యంగా..

ఈ మూడు వారాల్లో భారీగా పెరుగుదల



ఆదివారం దుర్గమ్మ దర్శనానికి ఒకటే రద్దీ

శుక్రవారం దుర్గమ్మ దర్శనమంటే భక్తులకు ఎంతో ప్రీతిపాత్రం. కానీ, ఇప్పుడు భక్తుల సెంటిమెంట్ ఆదివారానికి కూడా మారింది. ఆదివారం అమ్మను దర్శించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈనెల ప్రారంభం నుంచి ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఇంటర్ పరీక్షలు పూర్తవడం, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకుల దర్శనాలతో ఆదివారమొస్తే ఇంద్రకీలాద్రి నిత్య కల్యాణం పచ్చతోరణంలా కళకళలాడుతోంది. ఇక టెన్త్, డిగ్రీ పరీక్షలు పూర్తయితే భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

- ఉచిత దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- 30 వేల నుంచి 40 వేలకు పెరుగుదల
- రూ.500, రూ.300, రూ.100 టికెట్లకూ అంతే..
- దేవస్థానానికి భారీగా ఆదాయం
- లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా కూడా..
- సిఫార్సు దర్శనాలు తగ్గితే మరింత ఆదాయం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ ప్రతి శుక్రవారం కనిపించే విషయమే. ఇక ఆదివారం కూడా రద్దీ ఓ మోస్తరుగానే ఉంటుంది. కానీ, గత మూడు, నాలుగు వారాలుగా భక్తుల సంఖ్యను పరిశీలిస్తే.. అనూహ్యంగా పెరిగిందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి ఆదివారం భక్తుల రద్దీ ఉంటుందని, కానీ ఈ మధ్య మరింతగా పెరిగిందని అంటున్నాయి. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు పూర్తవ్వడంతో విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 3, 4 తేదీల్లో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం విద్యాసంస్థలకు సెలవులిస్తే ఇంద్రకీలాద్రి మరింత రద్దీగా కనిపించడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

వారంవారం హెచ్చు

ఆలయ గణాంకాల ప్రకారం ఒక ఆదివారానికి తర్వాత వచ్చే ఆదివారానికి భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

- ఈనెల 10వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 1,157 మంది దర్శనం చేసుకున్నారు. దీనిద్వారా రూ.5లక్షల78వేల500 ఆదాయం వచ్చింది. రూ.300 టికెట్ ద్వారా 700 మంది దర్శనం చేసుకోగా, రూ.2లక్షల10వేల ఆదాయం సమకూరింది. రూ.100 టికెట్ ద్వారా 3,612 మంది దర్శనం చేసుకున్నారు. దీనిద్వారా రూ.3లక్షల61వేల200 ఆదాయం దేవస్థానానికి సమకూరింది.
- ఈనెల 17వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 2,003 మంది దర్శనం చేసుకోగా, రూ.10లక్షల1500 ఆదాయం లభించింది. రూ.300 టికెట్ ద్వారా 1,008 మంది దర్శనం చేసుకున్నారు. ఈ టికెట్ల ద్వారా రూ.3లక్షల26వేల400 ఆదాయం వచ్చింది. ఇక రూ.100 టికెట్ ద్వారా 5,018 మంది చేసుకోగా, రూ.5లక్షల1800 ఆదాయం చేకూరింది.
- 24వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 2,319 మంది చేసుకోగా, రూ.11లక్షల59వేల500 ఆదాయం వచ్చింది. రూ.300 టికెట్ ద్వారా 1,302 మంది దర్శనం చేసుకోగా, రూ.3లక్షల90వేల600 ఆదాయం లభించింది. రూ.100 టికెట్ ద్వారా 6,248 మంది దర్శనం చేసుకోగా, రూ.6లక్షల 24వేల800 ఆదాయం చేకూరింది. కేశఖండన టికెట్ల ద్వారా ఈనెల 10వ తేదీన రూ.54,560 ఆదాయం రాగా, 17న రూ.1,17,120, 24న రూ.1,17,120 ఆదాయం వచ్చింది. భక్తుల రద్దీ పెరగడంతో ప్రసాదాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయంలోనూ పెరుగుదల కనిపిస్తోంది. రాబోయే రోజులన్నీ సెలవులు కావడంతో ఈ ఆదాయం మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఉచిత దర్శనానికి భారీ పెరుగుదల

ఆర్జిత టికెట్ల ద్వారానే కాదు.. ఉచిత దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్యలోనూ భారీగా పెరుగుదల కనిపించింది. సాధారణంగా ఆదివారాల్లో 25 వేల నుంచి 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కానీ, ఈ నెల ఆదివారాల్లో రద్దీ అనూహ్యంగా పెరిగింది. ప్రతి ఆదివారం సుమారు 35 వేల నుంచి 40 వేల మంది భక్తులు దర్శనానికి వస్తున్నారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.



ఆద్యంతమూ భక్తిభావం
కూచిపూడి అభినయం
- 6లో..

బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాల్సిందే
- తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటు



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (మంగళ)
సహర్ (ఉదయం) : 4-47 (బుధ)

బందరులో హోలీ సంబరం



రెడ్డిగూడెంలో టీడీపీ నాయకులతో వసంత వెంకట కృష్ణప్రసాద్

అమరావతిని సర్వనాశనం చేసిన జగన్

- వసంత వెంకట కృష్ణప్రసాద్



జి.కొండూరు/రెడ్డిగూడెం, మార్చి 25 : ఎన్నికల ముందు అమరావతిని రాజధానిగా చెప్పి తర్వాత మూడు రాజధానులుగా మాట మార్చి అమరావతిని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారని మైలవరం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ విమర్శించారు. సోమవారం కట్టుబడిపాలెంలో టీడీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వసంతకు గ్రామస్థులు ఘనస్వాగతం పలకగా మహిళలు హారతులు పట్టారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏపీలో పరిశ్రమలు రాక యువత భవిష్యత్తు నాశనమవుతోందని, సమగ్ర అభివృద్ధి జరగడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు మౌలిక సదుపాయాలు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు.

రెడ్డిగూడెంలో సోమవారం కృష్ణప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, దాసరి శివన్నారాయణలతో ఆయన చర్చలు జరిపారు. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ కోసం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాఘవాపురంలోని సత్తిరెడ్డి పద్మావతి(పెద్దమ్మతల్లి)లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అప్పులు, పన్నులతో నడ్డివిరిచిన జగన్

- దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి : సంపద సృష్టి చేతకాక అప్పులు, పన్నులతో జగన్‌రెడ్డి ప్రజల నడ్డి విరిచాడని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో సోమవారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఐదేళ్ల పాలనలో చెత్త పన్నులన్నీ వేసిన జగన్ ఔరంగజేబునే మించిపోయాడని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేయక పోగా అద్దె, ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని తీసేసి ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్ను విధిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల పెంపుతో వేలకోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.



తమిరిశలో ఇంటింటి ప్రచారంలో వెనిగండ్ల రాము

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : వెనిగండ్ల

నందివాడ : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో రావాలని గుడివాడ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య, మాగంటి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెనిగండ్లకు తమిరిశ గ్రామంలో కార్యకర్తలు పూలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ' పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులు కూడా వాడేసుకుని గ్రామాలను అంధకారంలో ఉంచారన్నారు. రావి మాట్లాడుతూ, కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలు సమస్యలు పట్టని నానికి ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. దానేటి సన్యాసిరావు, మద్దాల కరుణాకరరావు, వెంకటేశ్వరరావు, నాగరాజు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

వైసీపీతో విసిగెత్తి టీడీపీలోకి చేరికలు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 25 : అవినీతి, అక్రమాలకు నెలవైన వైసీపీతో విసిగిపోయిన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. 19వ డివిజన్‌లోని వైఎస్ఆర్ కాలనీలో సోమవారం 50 కుటుంబాలు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండి రామకృష్ణల సమక్షంలో తెలుగుదేశంలో చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజలకు ఎన్నో లాభాలున్నాయన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, బందరులో పేర్ని నాని కుటుంబసభ్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, బచ్చుల బోసుబాబు, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో తాతయ్య, చినబాబు

తాతయ్య సమక్షంలో..

జగ్గయ్యపేట: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం, పిల్లలు భవిష్యత్ నాశనమవుతుందని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీరాం తాతయ్య అన్నారు. సోమవారం తొర్రగుంటపాలెంకు చెందిన తోట నరసింహారావు, కలాల పుల్లయ్య, తాటి శ్రీనివాసరావు, రేవంత్, కుటుంబం సైదా, నిఖిల్, మక్కపేట నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, నాగుల్‌మీరా, గోపీ, మాసారపు సాయికృష్ణలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. 31వ వార్డు శాంతినగర్‌కు చెందిన అధికార పార్టీకి చెందిన దేవభక్తుని రమేష్ బాబు, నాగేశ్వరరావు, ఎం.బాబు, ఎల్.గోపినాథ్, జి.నరేంద్ర, బి.శ్రీకాంత్‌లు తాతయ్య సమక్షంలో టీడీపీలో చేరారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్, పార్థసారథి

సారథి, బోడె సమక్షంలో..

ఉయ్యూరు : ముదునూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు బీసీ, ఎస్సీ, ఓసీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. పాలడుగు సత్యనారాయణ 50మందికి పైగా అనుచరులతో కలిసి వైసీపీని వీడి పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్థసారథి కార్యాలయంలో పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధితోపాటు, రైతులకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో వైసీపీని వీడినట్టు సత్యనారాయణ తెలిపారు.

తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు, మార్చి 25 : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు సోమవారం అఖండ జ్యోతి స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి లాంఛనంగా తిరునాళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత ఆలయ స్థల దాత చింతయ్య తరఫున తూర్పు బజార్ దళితులు అమ్మవారికి తొలిబోనం సమర్పించి పూజలు చేశారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వేల్పుల రవికుమార్, ముండ్లపాటి ప్రసాదరావు, కర్ల వెంకటేశ్వర్లు, ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తున్న తూర్పు బజార్ దళితులు

అమ్మవారికి రూ.1.81 కోట్ల ఆదాయం

తిరుపతమ్మ దేవస్థానం వద్ద వ్యాపారాలు, వివిధ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.1.81 కోట్ల ఆదాయం సమకూరినట్టు ఇవో రమేష్‌నాయుడు చెప్పారు. బేడా మండపంలో వేలం నిర్వహించగా ఆలయ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో విద్యుత్ కాంతులతో తిరుపతమ్మ దేవస్థానం

ప్రహసనంగా వాహన తనిఖీలు

- చెక్‌పోస్టుల వద్ద పెరిగిన రద్దీ
- సిబ్బంది కొరత, అరకొరగా చెకింగ్

జగ్గయ్యపేట రూరల్, మార్చి 25 : ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో తనిఖీలు ప్రహసనంగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని గరికపాడు, ముక్త్యాల, గండ్రాయి గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గరికపాడు వద్ద 65వ నంబరు జాతీయ రహదారి కావటంతో నిత్యం వందల వాహనాలు వస్తుంటాయి. అన్ని వాహనాలను తనిఖీ చేయటం సిబ్బందికి కత్తి మీద సాములా మారింది. జాతీయ రహదారిపై ప్రధాన రహదారిని బారికేడ్లతో మూసి సర్వీస్ రోడ్డులో వాహనాలు వచ్చేలా ఏర్పాటు చేయటంతో అటుగా వచ్చే భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు కూడా ఒకేసారి రావటం అరకొర సిబ్బందితో తనిఖీలు చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భారీ వాహనాల ప్రవేశానికి ప్రధాన మార్గం, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మరొక వరుసలో తనిఖీ చేసేవారు. నేడు ఒకే దారిలో భారీ, చిన్న వాహనాలను తనిఖీ చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా సిబ్బందికి కూడా కత్తిమీద సాములా మారాయి.



తనిఖీల కోసం బారులు తీరిన వాహనాలు

ఆ వాహనాల తనిఖీలు శూన్యం

ప్రభుత్వ, ఎమ్మెల్యే, ఎంపీ, ఛైర్మన్, ప్రెస్, పోలీస్, తదితర స్టిక్కర్లతో పాటు సైరన్ మోగిస్తూ వస్తున్న వాహనాలను చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఆ వాహనాలను ఆపితే మా వాహనాలు కూడా తనిఖీ చేస్తారా అని మాట్లాడుతుండటంతో సిబ్బంది మిన్నకుంటున్నారని, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇక్కట్లు

జాతీయ రహదారిపై మూడు షిఫ్టుల్లో తనిఖీలు చేస్తున్నా అరకొర సిబ్బందితో వందల సంఖ్యలో వస్తున్న వాహనాలను తనిఖీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెక్‌పోస్టు వద్ద కనీస వసతులు కూడా లేవని, ఏదైనా అవసరమైతే 15 కి.మీల దూరంలోని జగ్గయ్యపేట, లేకుంటే రామాపురం క్రాస్‌రోడ్డు గానీ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు మండుతున్న ఎండలు, వాహనాల నుంచి వచ్చే వేడి, కాలుష్యంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలలో పాల్గొంటున్నా సింహభాగం భారం పోలీసులపైనే పడుతున్నది. మిగిలిన శాఖలు నామమాత్రంగాపాల్గొంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి రెండింతలు సిబ్బందిని ఏర్పాటు చేస్తే తనిఖీలు పటిష్ఠంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు స్పందించాలని వాహనదారులు సూచిస్తున్నారు. అదనపు సిబ్బంది, వసతులు కల్పిస్తే తనిఖీలు పారదర్శకంగా సాగుతుందని చెబుతున్నారు.

బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాల్సిందే..

- తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటు
- అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించటంపై ఆగ్రహం
- రాజీనామాలకు సిద్ధమని ప్రకటన

అవనిగడ్డ, మార్చి 25 : టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గ సీటును జనసేనకు కేటాయిస్తూ పార్టీ నిర్ణయం తీసుకోవటం పట్ల తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవనిగడ్డలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఇంటి వద్ద సోమవారం ఉదయం జరిగిన అత్యవసర సమావేశంలో పార్టీ శ్రేణులు, నేతలు పాల్గొని సమన్వయ కమిటీతో గానీ, నియోజకవర్గ ఇంచార్జ్‌తో గానీ ఎలాంటి సంప్రదింపులు లేకుండా అవనిగడ్డ సీటును జనసేనపార్టీకి ఎలా కేటాయిస్తారంటూ పలువురు నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వైసీపీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి బుద్ధప్రసాద్‌ను కాదని, ఎక్కడి నుంచో డబ్బు సంచులతో దిగుతున్న వారికి సీటు కేటాయిస్తే తాము పనిచేయాలా అని ప్రశ్నించారు. కార్యకర్తల అభీష్టానికి వ్యతిరేకంగా అధినాయకత్వ నిర్ణయాన్ని తాము సమర్థించబోమని, అవసరమైతే పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేస్తామని కొందరు ప్రకటించగా, మరి కొందరు తెలుగుదేశం కండువాతోనే స్వతంత్రంగా పోటీచేసి సత్తా చూపుదామని పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నేత రావి చిట్టిబాబు, టీడీపీ సీనియర్ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అవసరమైతే స్వతంత్రంగా పోటీ చేసి సత్తా చాటుదామని మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు సూచించారు.

ఊహించలేదు : మండలి వెంకట్రామ్

1972 నుంచి తమ కుటుంబం రాజకీయాల్లో ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యక్తిగా తాత మండలి వెంకట కృష్ణారావుకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న తనతండ్రి బుద్ధప్రసాద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మంచి పేరు ఉందని, అలాంటి కుటుంబానికి నేడు కనీసం సమాచారం ఇవ్వకుండా సీటును వేరే వారికి కేటాయించే పరిస్థితి వస్తుందని ఊహించలేదని మండలి బుద్ధప్రసాద్ తనయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. సీటు జనసేనకు ఎలాంటి పరిస్థితుల్లో కేటాయించాల్సి వచ్చిందో తమకు చెప్పి ఉంటే తాము స్వాగతించి ఉండేవారమన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఆద్యంతం భక్తిభావం..

కూచిపూడి అభినయం



బాలాజీ బృందం కూచిపూడి నాట్యాభినయం

కేరళ బృంద కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి, మార్చి 25 : బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆరవ రోజైన సోమవారం శ్రీ సిద్ధేంద్ర కళావేదికపై కూచిపూడి నాట్యాంశాలు ఆద్యంతం భక్తిభావంలో ముంచెత్తాయి. సప్పా శివకుమార్ శిష్యబృందం మూషిక వాహన, అదివో, అల్లదివో, కొండలలో నెలకొన్న అంశాలు ప్రదర్శించారు. దొడ్డా బాలాజీ (హైదరాబాద్) శిష్య బృందం దశవతార శబ్దం, దేవి స్తుతి, ఎందరో మహానుభావులు అంశాలను ప్రదర్శించారు. అనంతరం పసుమర్తి శ్రీ వల్లీ శిష్యబృందం మూషిక వాహన, వినాయక కౌత్వం అంశాల్లో హావభావాలు ఆకట్టుకున్నాయి. దేవరకొండ శ్రీనివాస శిష్యబృందం బ్రహ్మాంజలి, శివపార్వతీ అంశాలు ప్రదర్శించి మెప్పించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయ్య శర్మ, శ్రీలక్ష్మీ గోవర్ధనం కేరళ శిష్య బృందం గణేశ కౌత్వం, పూజా నృత్యం, జతి స్వరం, దశవతార శబ్దం అంశాలు ప్రదర్శించి నాట్యాంశాలకు వన్నె తెచ్చారు. అనంతరం కళాకారులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

భూ హక్కుల చట్టాన్ని అడ్డుకుందాం

- రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

చల్లపల్లి, మార్చి 25 : దున్నే వానికే భూమి ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో భూ హక్కుల చట్టాన్ని ఎదుర్కోవాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పిలుపునిచ్చారు. పేద, మధ్య తరగతి రైతుల భూములు, ఆస్తులు, సాగు హక్కులను కాలరాసే ఉద్దేశ్యంతో తెచ్చిన ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం-2023ను రద్దు చేయాలని కోరుతూ రైతుకూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో చల్లపల్లి ఏటీఎం సెంటరులో సోమవారం సాయంత్రం బహిరంగ సభ జరిగింది. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జె.జగన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝాన్సీ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వ్యవసాయాన్ని స్వదేశీ దోపిడీ వర్గాలకు, కార్పొరేట్లకు అప్పగించటానికి ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలుచేయటంలో దూకుడుగా వెళుతోందన్నారు. దీనిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత శాశ్వత భూ హక్కుల చట్టం-2023 చేయించారన్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రైతులకే కాక సామాన్య ప్రజల ఆస్తులకు కూడా భద్రత ఉండదన్నారు. ఇప్పటివరకూ భూమి హక్కుల వివాదాలపై రెవెన్యూ రికార్డుల ఆధారంతో కోర్టుకి వెళ్లి హక్కులను సాధించుకునేవారనీ, ఈ చట్టం ద్వారా ల్యాండ్ టైటిల్ అధికారి ఇచ్చినటువంటి ధృవీకరణ పత్రాలే శాశ్వత పట్టాలుగా ఉండబోతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతాంగ భూములను కట్టబెట్టడం కోసం చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. రైతాంగం దున్నే వానికి భూమి హక్కు నినాదంతో భూ హక్కు చట్టం రద్దుకు ఉద్యమించాలన్నారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి యు.వీరబాబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, సభాధ్యక్షులు జె.జగన్‌లు ప్రసంగించారు. భూ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ



లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న చల్లా రాజేంద్రప్రసాద్, శాంత దంపతులు

వైభవంగా లక్ష్మీనారాయణుడి విగ్రహ ప్రతిష్ఠ



గుడ్లవల్లేరు, మార్చి 25 : కౌతవరం చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి యంత్రం, శిఖర, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు సోమవారం వేలాదిమంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి. గణపతి పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ఆరాధన, గర్త పూజ, రత్న న్యాసం, యంత్ర స్థాపన, లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, జీవన్యాసములు, కుంభాభిషేకం, మహానైవేద్యం, అగ్ని ఉద్వాసన, శ్రీలక్ష్మీనారాయణ స్వామివార్ల కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు. కాంటినెంటల్ కాఫీ నిర్వాహకులు చల్లా రాజేంద్రప్రసాద్, శాంత దంపతులచే యంత్రం, విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి కళ్యాణం నిర్వహించారు. గరుత్మంతుని కానూరి లక్ష్మీనారాయణ ప్రసాద్ (కె.ఎల్.ఎన్.ప్రసాద్) కుమారుడు, కోడలు కానూరి జగదీష్ ప్రసాద్, సత్యవతి దంపతులు ప్రతిష్ఠించారు. శిఖర ప్రతిష్ఠను మమినేని విక్రమం, హైమ దంపతులచే నిర్వహించారు. కార్యక్రమానికి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన కౌతవరం గ్రామస్థులు హాజరై స్వామివార్లను దర్శించుకొన్నారు. అనంతరం 5 వేలమందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ దేవస్థానంలో హోలి పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ అలివేటి మండపంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు, పాలకవర్గం పాల్గొన్నారు.



కనులపండువగా రథోత్సవం

కూచిపూడి : బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ నేతృత్వంలో ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా

గుడివాడ, మార్చి 25 : ఈ నెల 27, 28 తేదీల్లో గుడివాడలో నిర్వహించాల్సిన ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభలను వాయిదా వేస్తున్నట్టు జిల్లా కన్వీనర్ టి.తాతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా మహాసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినప్పటికి ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ఆహ్వానసంఘం సభ్యులు సత్యనారాయణ సూచన మేరకు జూలై 27, 28 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తాతయ్య తెలిపారు.

కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన ఉద్యోగుల తొలగింపు

పెనమలూరు : ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఉద్యోగులపై అధికారులు వేటు వేశారు. పెనమలూరు మండలం పెదపులిపాక పంచాయతీ శానిటరీ సూపర్‌వైజరుగా పనిచేస్తున్న షేక్ సుభాని, పీఏసీఎస్ ఉద్యోగిగా పనిచేస్తున్న షేక్ ఖలీల్ పాషాలు ఇటీవల మంత్రి జోగి తనయుడు జోగి రాజీవ్ సమక్షంలో వైసీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పెనమలూరులో ఉద్యోగుల బరితెగింపు' కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇరువురినీ విధుల నుంచి తొలిగించినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

పెదపులిపాకలో ప్రలోభాలు కొనసాగింపు

పెదపులిపాకలో బుక్‌కీపర్, అంగన్వాడీ టీచరుగా పనిచేస్తున్న ఇద్దరు మహిళలు ఇంటింటికీ తిరిగి ఓటర్లను ప్రలోభపెట్టి వైసీపీకి ఓటేయాలని, లేని పక్షంలో పథకాలు రాకుండాపోతాయని భయపెట్టి ఓటర్లతో ప్రమాణాలు చేయిస్తున్నట్టు సమాచారం. సదరు ప్రలోభాలపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

కంకిపాడులో బొడ్డురాయి ఏర్పాటు

కంకిపాడు, మార్చి 25 : స్థానిక పాత ఆసుపత్రి వద్ద సోమవారం సీతాదేవి విగ్రహ ఆవిష్కరణతో పాటు బొడ్డురాయిని ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి 11 నుంచి 2 గంటల వరకు గ్రామంలోకి ఎవరూ రాకుండా, బయటకు వెళ్లకుండా నిబంధనలు విధించారు. పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు రాత్రి 10.30 గంటల నుంచే మూతపడ్డాయి. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, ఏనుగ జయప్రకాష్, వణుకూరు విక్రం, గుమ్మడి కిరణ్, ముప్పా రాజా, మేదండ్రావు సతీష్, సుంకర శివ, బాయిన నాగరాజు పాల్గొన్నారు.

కూరగాయల లారీ బోల్తా

గండిగుంట(ఉయ్యూరు), మార్చి 25 : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట వద్ద సోమవారం కూరగాయల మినీ లారీ బోల్తాపడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి ఉయ్యూరు కూరగాయల లోడుతో వస్తున్న మినీ లారీ గండిగుంట వద్ద టైరు పగలి డివైడర్‌పైకి వెళ్లి పక్కరోడ్డుపై పల్టీకొట్టింది. కూరగాయలన్నీ నేలపాలుకాగా ఆసయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



గండిగుంట వద్ద బోల్తాపడిన లారీ

డయల్ యువర్ డీఎం నేడు

ఉయ్యూరు, మార్చి 25 : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సూచనలు, సలహాలు, ఫిర్యాదుల స్వీకరణ నిమిత్తం మంగళవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలపాలని పేర్కొన్నారు.

ముస్లింలకు అల్పాహార విందు



అల్పాహార విందులో పాల్గొన్న ముస్లింలు

ఉయ్యూరు, మార్చి 25 : రంజాన్ మాసం ఉపావాసదీక్షలో ఉన్న ముస్లింలకు సోమవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు, బిల్డర్ ముప్పా శివరామకృష్ణ అల్పాహార విందు ఇచ్చారు. ఉపవాస దీక్ష పూర్తయిన తరువాత దయారా మసీదులో ముస్లింలని కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి అల్పాహారం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు భానుప్రకాశ్, గఫార్, సలీమ్ తదితరులు సేవలందించగా ప్రముఖ వైద్యులు, కరీమ్, తోట శ్రీకాంత్ విందులో పాల్గొన్నారు.

ఇండియా కూటమికి
ప్రజల మద్దతు : వింతా

హనుమాన్‌జంక్షన్, మార్చి 25 : మతతత్వ పార్టీ బీజేపీకి ప్రత్యామ్నాయంగా రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రజల మద్దతుతో ఊపందుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల బాండ్లు పేరుతో బీజేపీ భారీ కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు. ఎన్నికల బాండ్లు రూపంలో కాషాయ కూటమి చేసిన బ్లాక్‌మెయిల్ రాజకీయం రానున్న ఎన్నికల్లో ప్రజలు బట్టబయలు చేసి ఓడించడం ఖాయమని తెలిపారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని సంజీవరెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్ర హితం కోసమే కలయిక

గన్నవరం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



యార్లగడ్డను సన్మానిస్తున్న మూడు పార్టీల ముస్లిం నాయకులు

గన్నవరం(ఉంగుటూరు), మార్చి 25 : రాష్ట్ర హితం కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల్లో పొత్తుపెట్టుకోవాలని నిర్ణయం తీసుకున్నాయని, ఈ పొత్తును ప్రజలు ఆమోదించారని, అందుకు చిలకలూరిపేటలో విజయవంతమైన భారీ బహిరంగసభ నిదర్శనమని గన్నవరం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గన్నవరం గడ్డమీద ఎన్నికల శంఖారావాన్ని పూరించాలని నినదిస్తూ సోమవారం సాయంత్రం స్థానిక రోటరీక్లబ్ ఆడిటోరియంలో మూడుపార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్నికల కురుక్షేత్రంలో కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త తమ బాధ్యతను విస్మరించకుండా శక్తివంచనలేకుండా పనిచేయాలని, కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి సముచితస్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గన్నవ రంలో ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. సభాధ్యక్షుడు అంజిబాబు, టీడీపీ గన్నవరం, విజయవాడరూరల్, ఉంగుటూరు, బాపులపాడు మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వర రావు, గొడ్డళ్ల చిన్నరామారావు, ఆరుమళ్ల వెంకటకృష్ణా రెడ్డి, దయాల రాజేశ్వరరావు, నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, బోసుబాబు, గుజ్జర్లపూడి బాబూరావు, దొంతు చిన్నా, మేడేపల్లి రమ, కొండా, మొవ్వ వెంకటేశ్వరరావు, సాంబిరెడ్డి, నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, నాయకులు బండ్రెడ్డి రవి, చిమటా రవివర్మ, సూదం గోవర్ధన్, పొదిలి దుర్గారావు, పచ్చిపాల లక్ష్మణ్‌రావు, వడ్డె శివనాగేశ్వరరావు, శ్రీపతి శిరీష, మేకల స్వాతి, సంధ్య, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు చిగురుపాటి కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పణి, నాయకులు లక్కంరాజు మల్లికార్జున రాజు, నాదెళ్ల మోహన్, నల్లూరి కోటేశ్వరరావు, కానూరి శేషుమాధవి, కొత్తంగి శ్రీనివాస్, బుజ్జి, గన్నవరం నియోజకవర్గంలోని అన్నిగ్రామాల నుంచి మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

విజయవాడ రూరల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బాపులపాడు సమీపంలోని మల్లవల్లి పారిశ్రామిక పార్కులో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తామని తెలుగుదేశం పార్టీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నున్నలో సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ అధినేత నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఉందని, పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి పుట్టా ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహేశ్ యాదవ్

హనుమాన్‌జంక్షన్,మార్చి 25 : టీడీపీ కూటమి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్ సోమవారం స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయన విజయవాడ నుంచి నియోజకవర్గానికి మొదటిసారి వెళుతూ మార్గమధ్యంలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనతో పాటు దెందులూరు, నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, కొలుసు పార్థసారథి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా జంక్షన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అట్లూరి రమేష్, యనమదల వాసు, నాని, రమేష్, వేమూరి శ్రీనివాస రావు, పావులూరి రామారావు, వడ్డి వాసవి, వేగిరెడ్డి పాపారావు, గండి రాంబాబు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

కంకిపాడు, మార్చి 25 : బెల్టుషాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నామని కంకిపాడు ఎస్సై డి. సందీప్ తెలిపారు. మండలంలోని గొడవర్రులో బెల్టుషాపుపై దాడి చేసి కాగిత సత్యనారాయణను అదుపులోకి తీసుకొని సోమవారం మీడియా ముందు హాజరు పరిచారు. నిర్వాహకుడి నుంచి 8 మద్యం సీసాలు స్వాధీన పర్చుకున్నారు. **ఉంగుటూరు :** పెదఅవుటపల్లిలో ఓ మహిళ బెల్ట్‌షాప్ నిర్వహిస్తుందన్న సమాచారం మేరకు ఆత్కూరు ఎస్సై ఎ.పైడిబాబు, సిబ్బందితో కలిసి ఆమె ఇంటిపై దాడి చేసి సంచిలో దాచిన 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మహిళ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను ఆపి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రంగన్నగూడెం కార్యదర్శిపై చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 25 : ఎన్నికల నియమావళి అమలులో ఉండగా స్థానిక వైసీపీ నాయకులకు సహకరించి సీసీ రహదారి పనులు మొదలు పెట్టడం, స్థలం లేకుండానే 146 మంది లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి వాలంటీర్ల ద్వారా పట్టాలు ఇస్తామంటూ ప్రచారం చేయడం లాంటి విషయాలపై ఫిర్యాదుతో కార్యదర్శి అలా కళ్యాణిపై కలెక్టర్ క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. రంగన్నగూడెం పంచాయతీ కార్యదర్శి కళ్యాణిని విధుల నుంచి తొలగించి గన్నవరం-3 సచివాలయానికి బదిలీ చేశారు. నూతన కార్యదర్శిగా ఆరుగొలను గ్రేడ్1 కార్యదర్శి సురేష్‌కుమార్‌కు పూర్తి బాధ్యత లిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

ఉంగుటూరు, మార్చి 25 : కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరచిన కేసులో భార్యాభర్తలకు గన్నవరం 12 ఏఎంఎం కోర్టు న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మండలంలోని లంకపల్లి శివారు ఓండ్రంపాడు గ్రామానికి చెందిన గుర్రాల సుబ్బారావు, గంగావాణి దంపతులు స్థానిక చెరువు గట్టుపై వున్న స్థలంలో గేదెల షెడ్డు నిర్మాణం చేపట్టారు. చెరువులో మోటారు ద్వారా నీళ్ల తోడి చావిడిని తడిపేందుకు పైప్ వేస్తున్న క్రమంలో అరటిచెట్లు అడ్డురావటంతో సుబ్బారావు వాటిని నరికివేశాడు. దీంతో తాను నాటిన అరటిచెట్లను ఎందుకు నరికావంటూ అతని అన్నా-వదినలు గుర్రాల శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ గొడవకు దిగారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ సుబ్బారావు దంపతులపై దాడిచేయడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో ఉంగుటూరు పీఎస్‌లో అప్పటి ఎస్సై జి.రాజు కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తిచేసిన ఆయన నిందితులపై గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 10మంది సాక్ష్యులను విచారించిన న్యాయస్థానం నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రెండు సంవత్సరాల జైలు, రూ. 6వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక్కొక్కరూ మూడు నెలల జైలుశిక్ష అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

టీడీపీ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతి



పెదఓగిరాలలో జరిగిన శంఖారావంలో బోడె వెంకట్రామ్, పార్టీ నాయకులు

పెదఓగిరాల(ఉయ్యూరు), మార్చి 25 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. పార్టీ తలపెట్టిన శంఖారావం కార్యక్రమంలో భాగంగా పెదఓగిరాలలో సోమవారం పర్యటించి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పోతిరెడ్డి, నాగబాబు, ప్రసాదరెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, జలీల్, రెహ్మాన్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలు ఎండగట్టాలి

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్



కాటూరులో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

కాటూరు(ఉయ్యూరు), మార్చి 25 : రాష్ట్రంలో వైసీపీ దురాగతాలు, వైఫల్యాలు, అవినీతిని ప్రజల్లో ఎండగట్టడంతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. కాటూరులో సోమవారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అధఃపాతాళానికి వెళుతుందని, ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కనుమరుగైందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నాయకులు వెంకటనారాయణ, మోహన్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, కాటూరు శరత్, పోతురాజు, ఆళ్ల శ్రీకాంత్, కె. రవి, వి. సత్యనారాయణ, నాగభూషణం పాల్గొన్నారు.

50 రోజులు కష్టపడండి

కంకిపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికలకు 50 రోజులు కష్టపడితే సైకో జగన్ తరమికొట్టేందుకు వీలుంటుందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పార్టీ కార్యాలయంలో సోమవారం క్లస్టర్ మీటింగ్‌తో పాటు క్లస్టర్ బీసీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికలకు క్లస్టర్ పరిధిలోని బూత్ లెవల్ కమిటీలు విశేషంగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చి టీడీపీ ఓటు వేయించే విధంగా పనిచేయాలన్నారు. అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరినీ కలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అన్నే ధనయ్య, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, సెంగెపు రంగారావు, యలమంచిలి కిషోర్‌బాబు, రవి, కొండవీటి శివయ్య, నాగరాజు, బొర్రా వెంకట్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో మాట్లాడుతున్న మారుపూడి ధనకోటేశ్వరరావు

బోడె ప్రసాద్ విజయానికి కృషి

పెనమలూరు : నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ విజయానికి అందరూ కలసి కృషి చేయాలని పెనమలూరు క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో నారా భువనేశ్వరి నియోజకవర్గంలో నిజం గెలవాలి యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన శంఖారావం, సూపర్ సిక్స్ కార్యక్రమాలను బూత్ కన్వీనర్లు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, బొమ్మిడి అన్నపూర్ణ, కొమ్మినేని శ్రీనివాస్, మాబు సుభాని, సుంకర రమేష్, అబ్దుల్ గౌస్, కోనేరు వెంకటేశ్వరరావు, దొండపాడు సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గోసాల నాయకులు



చంద్రబాబుతో తెలికుల సంఘ నాయకులు

గోసాల (కంకిపాడు), మార్చి 25 : పెనమలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ పేరును అధిష్ఠానం ప్రకటించటంతో ఆయనను గెలిపించుకుంటామని ఆ పార్టీ తెలికుల సంఘం అధ్యక్షుడు ఎందువ రాంబాబు అన్నారు. గోసాల గ్రామ టీడీపీ నాయకులు, తెలికుల సంఘం నాయకులు సోమవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, పెనమలూరు టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ పేరు ప్రకటించటం హర్షణీయమన్నారు. ఆయనకు అన్ని వర్గాలు మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిప్పాడ శ్రీనివాసరావు, కెల్లా త్రిమూర్తులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 25 : ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని బాపులపాడు కార్యదర్శి సీహెచ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇళ్ల పన్ను వసూళ్ల కార్యక్రమం పెనుభారంగా మారిందని, ఏళ్ల తరబడి కొంతమంది పన్నులు చెల్లించని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వారిపై కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

ఎస్.ఎన్.పాలెం, కోడూరుపాడులో ప్రత్యేక పూజలు



అభిషేక పూజలు నిర్వహిస్తున్న అంజిబాబు, దేవులబాబు, యుగంధరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 25 : అయ్యప్పదీక్షతో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యకరమైన క్రమశిక్షణతో కూడిన జీవనవిధానం అలవడుతుందని తోట శివశంకరగురుస్వామి తెలిపారు. ఎస్.ఎన్.పాలెం, కోడూరుపాడు గ్రామాల్లో అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ(విషు) పూజ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోడూరుపాడులోని కోదండరామాలయంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో 17వ సంవత్సరం కేరళ సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కేతినీడి జయప్రకాష్ దంపతులు, పాల్గొన్నారు. ఎస్.ఎన్.పాలెంలో ఏలూరు చెందిన తడికమళ్ల ప్రసాద్ గురుస్వామి పర్యవేక్షణలో కానుమోలు చెందిన మదన్‌మోహన్ గురుస్వామి, మధు స్వామి, అడపా దేవులబాబు ఆధ్వర్యంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ అడపా అంజిబాబు, దేవులబాబు, యుగంధరరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

బందరులో ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలి : సీపీఎం

మచిలీపట్నం టౌన్, మార్చి 25 : బందరులో ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుట్టాయిపేటలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకులకు కాంట్రాక్టర్ల నుంచి మామూళ్ల వసూలు చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ తాగునీటి సరఫరాపై లేదన్నారు. టిడ్కో ఇళ్లకు సైతం తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు కల్పించకపోవడం దారుణ మన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద పారిశుధ్యం లోపించిందన్నారు. రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు డీడీలు కట్టిన లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేయలేదన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ మాట్లాడుతూ, మచిలీపట్నంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. చిరువోలు జయరావు, యూనస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



జనార్దనపురం సెంటర్లో రోడ్డుపై ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

జనార్దనపురంలో డ్వాక్రా మహిళల ఆందోళన

● మూడు నెలలైనా జమకాని రుణమాఫీ సొమ్ము ● వైసీపీ నాయకుడే కారణమని ఆరోపణ

నందివాడ(జనార్దనపురం), మార్చి 25 : నాల్గో విడత డ్వాక్రా రుణమాఫీ డబ్బు ఖాతాలకు జమచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 200 మంది డ్వాక్రా మహిళలు గుడివాడ-ఏలూరు రహదారిపై జనార్దనపురం సెంటరులో సోమవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి మూడు నెలలైన డ్వాక్రా రుణమాఫీ సొమ్ము తమకు పడలేదని డ్వాక్రా మహిళలు వాపోయారు. స్త్రీనిధి సొమ్ములో అవకతవకలు జరిగాయని, ఆ సొమ్ము తాను ఇప్పిస్తానని గ్రామ వైసీపీ నాయకుడు కుమార్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడేమో తనకు తెలియదని అంటున్నాడని డ్వాక్రా మహిళలు తెలిపారు. నాల్గో విడత డ్వాక్రా రుణమాఫీ డబ్బు కూడా తమకు పడకుండా అతడే ఆపి ఉంటాడని వారు ఆరోపించారు. డ్వాక్రా రుణమాఫీ సొమ్మును వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విషయం తెలిసి ఎస్సై చంటిబాబు సంఘటనా స్థలానికి వచ్చి డ్వాక్రా మహిళలతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

వైసీపీ నాయకుల కనుసన్నల్లో అక్రమ మట్టి తవ్వకాలు

● రెవెన్యూ అధికారుల చోద్యం



గుడివాడ : అధికార వైసీపీ నాయకుల కనుసన్నల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఎన్నికల కోడ్ వచ్చినా అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. ఇటుక బట్టీలకు మట్టి తరలింపు పేరుతో అక్రమంగా మట్టిని విక్రయిస్తున్నారు. గుడివాడ మండలం లింగవరం-మెరకగూడెం రహదారి లో పట్టపగలు ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మైనింగ్ మాఫియా కూలీలను వినియోగిస్తున్నారు. సాయంత్రం వేళ ప్రారంభించి రాత్రి తవ్వుతున్నారు. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసం చేయడం లేదు. ఎమ్మెల్యే నాని ముఖ్య అనుచరుడి పాత్ర ఉండటంతో రెవెన్యూ అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు.



మృతి చెందిన చేనేత కార్మికులకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



బంటుమిల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాగిత కృష్ణప్రసాద్

చేనేత కార్మికుల సమస్యలు పట్టని జగన్

● ఆత్మహత్యలకు వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి : టీడీపీ

మచిలీపట్నం టౌన్, మార్చి 25 : చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోందని, రాజన్‌పేట జిల్లా ఒంటిమిట్ట మండలంలో పలువురు చేనేత కార్మికుల ఆత్మహత్యలకు కారణం వైసీపీ పాలకులేనని రాష్ట్ర సూర్య బలిజ కన్వీనర్, టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము ధ్వజమెత్తారు. సోమవారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన చేనేత కార్మికుల చిత్రపటాలకు చిత్తజల్లు నాగరాము, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గోకుల శివ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ అన్నం ఆనంద్, కట్టా అంజిబాబు, నారగాని కృష్ణ, రామగాని రత్నారావు, అడపా రత్నాకర్, చిన్నం సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్తజల్లు నాగరాము మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పద్మశాలీలు ఉన్నారని, వీరి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

బంటుమిల్లిలో కాగిత విస్తృత ప్రచారం

బంటుమిల్లి : టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ బంటుమిల్లిలో సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు, మోదీ, పవన్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, జనసేన అధ్యక్షుడు ర్యాలీ సత్యనారాయణ, బీజేపీ అధ్యక్షుడు బండ్రెడ్డి ఆంజనేయులు, మురారి వెంకటేశ్వరరావు, అమీర్, నూర్, అక్బర్, యిల్లారి లీలాకృష్ణ, రంగనాథ్, గంధం సత్యనారాయణ, బొర్రా కాశీ, దాసరి కరుణజ్యోతి, జరీనా, ఈడే వెంకన్న, సింగంశెట్టి శ్రీను, దాసరి ప్రసాదు, భూపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంజులూరులో వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం



బంటుమిల్లి : ముంజులూరులో విజయ కోదండ రామస్వామి విగ్రహ, ధ్వజ, శిఖర పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం హనుమత్ సీతా రామ లక్ష్మణ, గణపతి, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, శిఖర, బలిపీఠం పునః ప్రతిష్ఠలను బ్రహ్మశ్రీ యోగానంద వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం, భారీ అన్నసమారాధన జరిగాయి. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము, ఎంపీపీ వెలివెల చినబాబు, గ్రామప్రముఖులు, విజయకోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూడేరు వాసి దుర్మరణం

పామర్రు : మచిలీపట్నం - విజయవాడ ప్రధాన రహదారిపై కురుమద్దాలి ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పమిడిముక్కల మండలం కూడేరుకు చెందిన నంబూరి చంటేశ్వరరావు (50) దుర్మారణం చెందాడు. పామర్రులో బంధువుల ఇంట్లో వేడుకకు వస్తున్న తరుణంలో కురుమద్దాలి వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో చంటేశ్వరరావు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానం భూముల్లో మట్టి తరలింపుపై ఫిర్యాదు

పామర్రు : పట్టణంలోని విజయవాడ రోడ్డులోని ఆర్.ఎస్.నెం.111లోని వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందిన 5.93 ఎకరాల మాగాణి భూముల్లో మట్టిని తవ్వి తరలిస్తున్న విషయమై సామాజిక కార్యకర్త నూతక్కి వీరాంజనేయులు సోమవారం దేవస్థానం ఈవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈవో వెంకటరెడ్డి దేవస్థానం భూముల్లో మట్టి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించుకుని పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెడనలో రెండురోజులకోసారి నీటి సరఫరా

పెడన : ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పెడన మునిసిపాలిటీలో మంగళవారం నుంచి రెండు రోజులకోసారి మంచినీరు సరఫరా చేస్తామని కమిషనర్ బి. వెంకట్రామయ్య తెలిపారు. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు సహృదయంతో అర్థం చేసుకుని మునిసిపాలిటీకి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరులకు దానం చేస్తేనే లక్ష్మీ కటాక్షం





మచిలీపట్నం టౌన్ : లక్ష్మీదేవిని పూజిస్తే ఇహపర ప్రయోజనాలు చేకూరుతాయని త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమారాచార్య స్వామిజీ పేర్కొన్నారు. జగద్గురు రామానుజాచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో సోమవారం దయాకుంభ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపూజ, లక్ష్మీనారాయణ యజ్ఞం నిర్వహించారు. వేయి మంది మహిళలు సామూహికంగా లక్ష్మీఅష్టోత్తర నామ పారాయణ చేశారు. స్వామీజీ మాట్లాడుతూ, తమకున్న దానిలో ఇతరులకు దానం చేస్తే లక్ష్మీకటాక్షం ఉంటుందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రావి శారద మాట్లాడుతూ, భగవత్ కృపకు భక్తిమార్గం సులభమైందన్నారు. విష్ణు, లక్ష్మీదేవి అనుగ్రహం పొందేందుకు లక్ష్మీదేవిని ఆరాధించాలన్నారు. శ్రీకర స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికతత్వవేత్తలు ఎనిమిది మందిని అష్టలక్ష్ములుగా భావించి సత్కరించారు. చేబ్రోలు రాజసులోచన, జొన్నలగడ్డ మాధవి, గరిమెళ్ల బాలనాగమణి, కూరపాటి కుముదవల్లి, విఠల గౌరేశ్వరి, చిట్టికుమారి, దేసు అన్నపూర్ణ, లక్ష్మీకాంతంలను సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్తులకు కంకణాలు, లక్ష్మీ అష్టోత్తర పుస్తకాలను తురగా ప్రసాద్ అందజేశారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శ్రీకర రామానుజ తెలిపారు.



సామూహికంగా లక్ష్మీ అష్టోత్తర పారాయణ



అవనిగడ్డలో లక్ష్మీనారాయణ హోమం

అవనిగడ్డ : లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని గీతా మందిరంలో రాజ్యలక్ష్మీ అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మీ జయంతి హోమాలు నిర్వహించారు. మహా సుదర్శన హోమ ప్రాముఖ్యతను అర్చక స్వాములు దీవి నరసింహమూర్తి, దీవి అప్పలాచార్యులు, కళ్యాణ సుందరం, బాలకృష్ణమాచార్యులు వివరించారు. లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణుల శాంతి కల్యాణ మహోత్సవాన్ని రెడ్రౌతు రామమోహనరావు దంపతులు నిర్వహించారు. శ్రీహరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నాంచారమ్మ జాతర

● విశ్వనాథపల్లి, పెదప్రోలులో పోటెత్తిన జనం





విశ్వనాథపల్లి నాంచారమ్మ



పెదప్రోలు నాంచారమ్మ

కోడూరు, మార్చి 25 : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ జాతర వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో వచ్చి కృష్ణానదిలో స్నానాలు ఆచరించి పాల పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద గ్రామస్థుల సహకారంతో ఐదు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో కోడూరు ఎస్సై శిరీష ఆధ్వర్యంలో 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు పార్థసారథి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈవో సిహెచ్.సుధాకర్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **మోపిదేవి :** పెదప్రోలులో నాంచారమ్మ జాతర మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గురుప్రసాద్, ఆకుల వెంకట్రామయ్య, కెవిఎన్.కె.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగ ప్రసాద్, ఎస్సైలు చిన్నబాబు, వైవి.సత్యనారాయణ బందోబస్తు నిర్వహించారు.



కోడూరులో...



గుడివాడలో అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న వెనిగండ్ల

వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

కోడూరు : అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అఖండ స్థాపన, మండపారాధన, దీక్షా ధారణ, అనంతరం గణపతి, షణ్ముఖ, అయ్యప్ప స్వామి, మాళికాపురత్తమ్మ ఆవాహిత దేవతల హోమాలు కోడూరు వెంకటేశ్వరరావు, కోడూరు నాగరాజు దంపతులచే నిర్వహించారు. 108 లీటర్ల ఆవు పాలతో మూల విరాట్టుకు అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. మాచవరంలో విస్సంశెట్టి మాణిక్యాలరావు గురుస్వామి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో రాజేశ్వరస్వామి ఆలయం (శివాలయం) వద్ద అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండు వేల మందికి అన్న సమారాధన చేశారు. **పామర్రు :** వాసవీ కన్యకపరమేశ్వరి, అంకమ్మతల్లి దేవస్థానంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకలు, విశేష పూజలు నిర్వహించారు. వాసవీమాత ఆలయంలో బొగ్గవరపు సాయిబాబు, అంకమ్మతల్లి దేవాలయంలో ఘంటసాల సాయిరామ్ ప్రత్యేక పూజలు జరిపారు. **పెడన :** కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఉపాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. 18 రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన పూజల్లో కొల్లూరి అపర్ణ, బొలిశెట్టి విమల, జల్లూరి రాంబాబు, జవ్వాది నాగు, కొల్లిపర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** అయ్యప్పస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము కోరారు. బంటుమిల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనకాభిషేకంలో వెనిగండ్ల రాము పాల్గొన్నారు. కృష్ణన్ తాంత్రి పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ వెనగండ్లకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థాన అధ్యక్షుడుకొత్త వీరయ్య, కమిటీ సభ్యులు తాళ్ళూరి సుబ్బారావు, ఆనంద్, కొత్త మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రాఘవాచారిని సత్కరిస్తున్న సాహితీ ప్రముఖులు

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి

గుడివాడ : సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయులు వంగిపురపు రాఘవాచారి పేర్కొన్నారు. భారతి సమితి ఆధ్వర్యంలో నిత్య జీవితంలో ఆధ్యాత్మికత అంశంపై ఆయన ప్రసంగించారు. అనంతరం రాఘవాచారిని ఘనంగా సత్కరించారు. భారతి సమితి సభ్యులు, సాహితీప్రియులు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

మోపిదేవి : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మెరకనపల్లి సీతారామ మందిరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా జరిగాయి. సామూహిక వ్రతాల్లో 50 మంది దంపతులు పాల్గొన్నారు. టీటీడీ ధర్మాచార్యులు వీరాంజనేయులు, కృష్ణా జిల్లా కో-ఆర్డినేటర్ సివి.కె.ప్రసాద్ ఆధ్వర్యంలో టీటీడీ ప్రసాదం అందజేశారు.

పెరిక సంఘం అధ్యక్షుడిగా చండిక శ్రీహరి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం పెరిక సంఘం అధ్యక్షుడిగా చండిక శ్రీహరి ఎన్నికయ్యారు. సోమవారం ఈశ్వర్ రెసిడెన్సీలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా అంబటి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా చండిక అచ్యుతరావు, కోశాధికారిగా చండిక రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా జి. విజయసుధాకర్, కార్యవర్గ సభ్యులుగా లోకం గోపాలకృష్ణ, ముప్పిశెట్టి హరిగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుంటూరు బాపనయ్యకు నివాళి

గుడివాడ : కామ్రేడ్ గుంటూరు బాపనయ్య 46వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు వేశపోగు యేషయ్య పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఆర్‌సిపి రెడ్డి, ఎన్.ముఃకరళీ కృష్ణారెడ్డి, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, జి.గోపాల్, ఎ.వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ఎలీషారావు, టి.ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.